క్లుప్తంగా

వర్సిటీ ప్రగతికి సహకరించాలి



రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి జ్ఞాపిక అందజేస్తున్న వీసీ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: వర్సిటీ ప్రగతికి సహకరించాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కె.శ్యామలరావును డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని విజ్ఞప్తి చేశారు. అమరావతిలో సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపిక అందజేశారు. అనంతరం విశ్వవిద్యాలయంలో విద్యా విధానం, అభివృద్ధి, కోర్సుల నిర్వహణ వంటి అంశాలను వివరించారు. ప్రభుత్వం కేటాయించిన మూలధన వ్యయం రూ.15 కోట్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాలక మండలి సమావేశం కోసం అజెండా సిద్ధం చేసినట్లు తెలిపారు. నిర్వహణ తేదీ ఖరారు చేయాలని కోరారు. అనంతరం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నిర్వహించిన ప్రణాళికా మండలి సమావేశంలో పాల్గొన్నారు.

నేడు శ్రీకూర్మంలో డీపట్టాల పంపిణీ

గార: మేజర్ పంచాయతీ శ్రీకూర్మంలోని పడపానపేట, చుక్కపేట, నగిరెడ్డిపేట, నీలాపుపేట, దువ్వువానిపేట తదితర ఐదు గ్రామాల్లోని రైతులకు తరతరాలుగా ఉన్న భూమిపై ఎటువంటి హక్కుల్లేవు. వీరిందరికీ డీ- పట్టాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు పడపానిపేటలో మంత్రి ధర్మాన ప్రసాదరావు, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ హాజరై పట్టాలు పంపిణీ చేస్తారని తహసీల్దార్ ఎం.శ్రీను సోమవారం తెలిపారు. ఇందులో భాగంగా 185 మంది రైతులకు 85.70 ఎకరాలకు పట్టాలు పంపిణీ ఉంటుందన్నారు. పట్టాల పంపిణీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని ఏఎంసీ మాజీ చైర్మన్ బరాటం నాగేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు.

పంట మార్పిడితో మేలు



మాట్లాడుతున్న డీడీ త్రినాథస్వామి

రణస్థలం: మొక్కజొన్నని రెండు పంటలుగా వేయడం వల్ల చీడపీడల ఉద్ధృతి ఎక్కువ కావడంతోపాటు దిగుబడిపై ప్రభావం చూపుతుందని, దీంతో పంట మార్పిడి చేసుకోవాలని డీడీ కె.త్రినాథస్వామి తెలిపారు. మండలంలోని యర్రవరం పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో ఆత్మ, కేవీకేల ఆధ్వర్యంలో రైతులకు ఆరుతడి పంటలు, వేసవి పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో కేవలం యూరియా కాకుండా పోటాష్, భాస్వరం ఎరువులు వాడాలన్నారు. మొక్కజొన్నలో చీడపీడల యాజమాన్యం, వేసవి పంటలైన నువ్వు పంటలపై అవగాహన కల్పించారు. రైతులందరూ భూసారాన్ని పరిరక్షించే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి, ఏడీఏ వి.శ్రీనివాసరావు, డీఆర్‌సీ ఏఓ వై.సూర్యకుమారి, ఎ.భానుప్రియాంక, డి.విజయభాస్కర్ పాల్గొన్నారు.

24 గంటల్లోగా సమస్యను పరిష్కరిస్తున్నాం



మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి తులసీప్రసాద్ సాహు

జి.సిగడాం: మండల కేంద్రంలోని ప్రజలకు తాగునీటి సమస్య వస్తే.. 24 గంటల్లోగా ఆ సమస్యను పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జి.సిగడాం పంచాయతీ కార్యదర్శి తులసీప్రసాద్ సాహు అన్నారు. సోమవారం స్థానిక సచివాయలంలో ఏర్పాటు చేసిన వివిధ శాఖల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పలుచోట్ల తాగునీటి బోర్లు అడుగంటిపోవడంతో ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే అన్ని వీధిల్లో తాగునీటి వనరులు ఏర్పాటు చేశామన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకురాలి మృతికి సంతాపం



అంకమ్మ (ఫైల్)

జి.సిగడాం: ఎందువ గ్రామ మాజీ సర్పంచ్ వాన వెంకటరమణ తల్లి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు అంకమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పార్టీ అభివృద్ధికి గత పదేళ్లుగా అంకమ్మ ఎంతో సేవ చేశారు. కొడలు ప్రమీల మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా పని చేస్తున్నారు. అంకమ్మ మృతిపట్ల గ్రామస్తులు, పలువురు సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డుకు మహర్దశ

- ఆనందంలో సీపాన్నాయుడుపేట వాసులు





నాడు: అధ్వానంగా ఉన్న రోడ్డు



నేడు: సుందరంగా సీపాన్నాయుడుపేట రోడ్డు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం నగర పరిధిలోని సీపాన్నాయుడుపేట గ్రామానికి వెళ్లే రోడ్డుకు మహర్దశ పట్టింది. ఒకప్పుడు ఈ రోడ్డుపై వెళ్లాలంటే ప్రజలు నానా అగచాట్లు పడేవారు. మోకాల్లోతు గోతులు దర్శనం ఇచ్చేవి. చిన్న చినుకుపడినా నీరుచేరి ప్రజలు, వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా తయారయ్యేది. రోడ్డు సైడు కాలువలు కూడా శిథిలమై దర్శనమిచ్చేవి. రోడ్డును బాగు చేయాలంటూ స్థానికులు కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌లో పలుమార్లు వినతులు అందించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. ఇలాంటి పరిస్థితిలో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సీపాన రామారావు ఆధ్వర్యంలో రోడ్డు దుస్థితిని రవాణా శాఖమంత్రి ధర్మాన ప్రసాదరావు దృష్టికి తీసుకెళ్లారు. నిధులు మంజూరు చేయాలని కోరారు. వెంటనే స్పందించిన మంత్రి ధర్మాన మున్సిపల్ యంత్రాంగంతో మాట్లాడారు. సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. పది లక్షల నిధులు మంజూరు చేయించారు. వెంటనే రోడ్డు పనులు సైతం ప్రారంభించి పూర్తి చేయించారు. అలాగే సీసీ కాలువలను కూడా నిర్మించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నగరాల సంఘ సమావేశం విజయవంతం చేయాలి



సమావేశానికి హాజరైన సంఘ సభ్యులు

శ్రీకాకుళం: విశాఖ నగరంలో నిర్వహించనున్న నగరాల సంఘ ఆత్మీయ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని జిల్లా నగరాల సంఘ సభ్యులు సోమవారం పిలుపునిచ్చారు. నగరంలోని ప్రకాష్ నగర్ కాలనీలో సోమవారం జరిగిన సమావేశంలో ప్రతినిధులు మాట్లాడారు. తమ సమస్యలను పరిష్కరించాలని నగరాల కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, డైరెక్టర్లు కోరారు. కార్యక్రమంలో నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లా ఆనంద్‌కుమార్ పాత్రుడు, సంఘ కార్యదర్శి పండు రాజుగోపాల్, ఉపాధ్యక్షులు ఇల్లిపిల్లి నీలంనాయుడు, వేపారి ధర్మారావు, కోశాధికారి బీవీ రవిశంకర్, నల్లాన వెంకునాయుడు, కె.వెంకట్రావు, బి.దుర్గాప్రసాద్, అనంతరావు, అమ్మరావు ఉన్నారు.

జిల్లా అభివృద్ధికి తోడ్పాటు



వివిధ రంగాలకు చెందిన వారిని సత్కరిస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఒకేషనల్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం రాత్రి జరిగింది. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ జిల్లా పర్యటన సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక బాలసదనంలో విద్యార్థుల వస్తువులు దాచుకునేందుకు వీలుగా పెట్టెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ అవతారం, జిల్లా టూరిజం అధికారి నడిమింటి నారాయణరావు, జర్నలిస్ట్ గొండ్యాల ప్రశాంత్, సేంద్రియ రైతు దార్లపూడి రవి, ప్రముఖ డ్రామా ఆర్టిస్టు వి.వి.ఆర్.మూర్తి, సోషల్ వర్కర్, కొమ్మన శివప్రసాద్, టీచర్, సోషల్ వర్కర్ పూజారి హరిప్రసన్న, కళాకారుడు దివిలి హేమచంద్ర, ఖాది కార్మికుడు కొండమటి కొండలరావు, గిరిజన రైతు మందగి మంజులను ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ నాయుడు, గీతా శ్రీకాంత్, వసంతరావు, మంత్రి వెంకటస్వామి, ఎంఆర్‌కే దాస్, పసగాడ సూర్య, మణికంఠ, సంతోష్ పాల్గొన్నారు.

సమన్వయంతో విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఉమామహేశ్వరావు

జి.సిగడాం: రానున్న ఎన్నికల్లో అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని తహసీల్దార్ ఆర్.ఉమామహేశ్వరావు సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశాలను ప్రతీఒక్క అధికారి అంకితభావంతో పని చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయలపై ఆరా తీయాలన్నారు. ఎవరైనా విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీఓ వెంకన్నబాబు, మండల పంచాయతీ అధికారి ఎస్.శ్రీనివాసరావు, వైద్యులు బుడుమూరు యశ్వంత్, పేకల సుమబిందు, ప్రతిజ్ఞ శర్మ పాల్గొన్నారు.

'ఉపాధి' ఉద్యోగుల నిరసన



నిరసనలో ఉపాధి సిబ్బంది

శ్రీకాకుళం పాతబస్టాండ్: తమ సమస్యలు పరిష్కరించాలని ఉపాధి హామీ పథకం సిబ్బంది కోరారు. ఈ మేరకు సోమవారం డ్వామా కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. సుదీర్ఘకాలంగా ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతర ఉద్యోగులు తమకు వేతనాలు పెంచాలని, గ్రేడింగ్ విధానాన్ని అమలు చేయాలని, పీఆర్‌సీ వర్తింపజేయాలని కోరారు. సంఘ నాయకులు వైవీ రమణ, సుజాత, డి.రత్నాకర్, మన్మథరావు, ధనలక్ష్మి, విజయవాణి ఉన్నారు.

లావేరు మండలంలో..

ఎచ్చెర్ల: సుదీర్ఘకాలంగా ఉపాధి పథకంలో విధులు నిర్వహిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతర ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. లావేరు మండలంలోని ఉపాధి హామీ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. వేతనాలు పెంచాలని, సర్వీస్ క్రమబద్ధీకరణ, ఎఫ్‌టీఈ వర్తింపు చేయాలన్నారు.

ఘనంగా రుషిస్వామి వార్షికోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి అప్పలరాజు తదితరులు

కాశీబుగ్గ: కాశీబుగ్గ రోటరీనగర్‌లో భద్రావతి సమేత శ్రీభావన రుషిస్వామి వారు అష్టమ వార్షికోత్సవ కల్యాణ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. శ్రీమార్కండేయ పద్మశాలీల సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వేదపండితుల మంత్రోశ్చరణ మధ్య పలువురు ముత్తైదువులు కుంకుమ పూజలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మాధభక్తుల శివ, ఉపాధ్యక్షుడు మంచిశెట్టి ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి దొడ్డి శంకరరావు, సహాయ కార్యదర్శి రుపీధుల నాగేశ్వరరావు, కోశాధికారి మాదెంవర సత్యనారాయణ పాల్గొన్నారు.

బరంపురం–విశాఖ ప్యాసింజర్ రైలుకు ఘన స్వాగతం

కంచిలి: పలాస నుంచి విశాఖపట్నం వరకు నడుస్తున్న ఈఎంయూ రైలును బరంపురం వరకు విస్తరించారు. ఈ మేరకు ఆ రైలు బరంపురం నుంచి సోమవారం వేకువ జామున బయలుదేరగా సోంపేటలో ప్రయాణికుల సంఘం ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా కన్వీనర్ డాక్టర్ సీపాన గుణవతి, ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు, సోంపేట, కంచిలి మండలాలకు చెందిన పలువురు ఉన్నారు.

స్పందనలో భోజన ప్యాకెట్ల పంపిణీ



ఆహారం పొట్లాలను అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి వచ్చే వారికి ఉచితంగా సోమవారం భోజన ప్యాకెట్లను సత్యసాయి సంస్థ ప్రతినిధులు పంపిణీ చేశారు. జెడ్పీ ఎదురుగా ఉన్న సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నారాయణ సేవ కింద 210 మందికి భోజనాన్ని సమకూర్చారు. శ్రీనివాసరావు, లక్ష్మి దంపతుల సౌజన్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి



నిరసనలో వీవోఏలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వెలుగులో పనిచేస్తున్న వీవోఏలకు కాలపరిమితితో కూడిన సర్క్యులర్ రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, వీవోఏల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ప్రభావతి, జి.అశిరినాయుడు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు ఆర్.ప్రకాష్, డి.జోగారావు, ఎం.విమల, సరిత, రోహిణి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ మధుసూదనరావు

జి.సిగడాం: పల్లెల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే అటువంటి వారిపై స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ మధుసూదనరావు సూచించారు. సోమవారం సాయంత్రం వెంకయ్యపేట, జి.సిగడాం, ఎస్‌పీఆర్‌పురం కూడళ్ల వద్ద వాహనాలను తనిఖీ చేశారు. గ్రామాల్లో గుర్తుతెలియని వక్తులు సంచరిస్తే వెంటనే వారి దగ్గర ఉన్న గుర్తింపు కార్డులు తీసుకుని సమాచారం ఇవ్వాలన్నారు. దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. వాహనదారులు లైసెన్స్, పత్రాలు లేకుండా పట్టుబడితే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు ఉపయోగపడే ఆవిష్కరణలు జరగాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

టెక్కలి: సాంకేతిక పరిజ్ఞానంలో చోటు చేసుకుంటున్న సరికొత్త పరిణామాలకు అనుగుణంగా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా పుస్తకాలు రచించాలని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు సూచించారు. కళాశాలలో ఈసీఈ విభాగానికి చెందిన ప్రొఫెసర్లు ఎంఎస్‌వీఎస్‌ఎస్ కుమార్, పాగోటి శిరీష్‌కుమార్, పేడాడ కామేశ్వరరావు సంయుక్తగా రాసిన డిజిటల్ లాజిక్ డిజైన్ పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఆర్అండ్‌డీ డీన్ ఆజాద్, ఈసీఈ హెచ్‌వోడీ బి.రామారావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట



తారు రోడ్డు నిర్మాణానికి కొత్తపేటలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- రూ.85 లక్షలతో తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఎచ్చెర్ల క్యాంపస్: అభివృద్ధి, సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమప్రాధాన్యత ఇస్తూ పాలన సాగిస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. రూ.85 లక్షల ఏఎంసీ నిధులతో నిర్మించనున్న తోటపాలెం కూడలి నుంచి కొత్తపేట, ముద్దాడ అంబేడ్కర నగర్, ఎస్ఎస్ఆర్‌పురంను కలిపే తారు రోడ్డు నిర్మాణానికి సోమవారం శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో స్పష్టమైన అభివృద్ధి కనిపిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసినట్లు చెప్పారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి పెద్దపీట వేశామన్నారు. మంచి చేసిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, పార్టీ మండల కన్వీనర్ ముద్దాడ శంకర్, జేసీఎస్ ఇన్‌చార్జి మూగి శ్రీరాములు, పార్టీ కార్యాలయం ఇన్‌చార్జి మాడుగుల మురళీధర్‌బాబా, స్థానిక సర్పంచ్ బొడ్డేపల్లి గజలక్ష్మి, ఎంపీటీసీ గురుగుబెల్లి నర్సింగరావు, నాయకులు బొడ్డేపల్లి సుధాకర్, బగ్గు రాజారావు, కొత్తకోట సూర్యారావు, లింగాల లక్ష్మణ, దుంప చిన్నారెడ్డి, డీఈ ధర్మారావు, ఏఈఈ హేమలత పాల్గొన్నారు.

హోంగార్డుకు సత్కారం



నూకయ్య దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తూ సోమవారం ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు ఆరిక నూకయ్యను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జి.ఆర్.రాధిక ఘనంగా సత్కరించారు. నూకయ్య దంపతులను దుశ్శాలువతో సన్మానించి ప్రశంసాపత్రాన్ని, తక్షణ సాయంగా రూ. 5 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఎటువంటి సహాయం అవసరమైనా జిల్లా పోలీసు శాఖ తరపున అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఏవో సీహెచ్ గోపీనాథ్, ఆర్ఐ డి.సురేష్ ఉన్నారు.

ఆస్పత్రికి వెళ్లి.. పింఛన్ అందజేసి..



కాశీబుగ్గ: దమయంతికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ స్వప్న



వజ్రపుకొత్తూరు రూరల్: చిన్నమ్మడుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గాయత్రి

వజ్రపుకొత్తూరు రూరల్: పాతటెక్కలి పంచాయతీ లింగాలపాడు గ్రామానికి చెందిన ఇచ్ఛాపురం చిన్నమ్మడు అనారోగ్యంతో శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈమెకు ఈ నెలకు సంబంధించి వృద్ధాప్య పింఛన్ మంజూరైంది. దీంతో గ్రామ వలంటీర్ వజ్జ గాయత్రి సోమవారం వంద కిలోమీటర్లు ప్రయాణం చేసి ఆస్పత్రిలో ఉన్న చిన్నమ్మడుకు పింఛన్ మొత్తం మూడు వేల రూపాయలను అందజేసి ఆదర్శంగా నిలిచారు.

కాశీబుగ్గ: బొడ్డపాడు గ్రామానికి చెందిన బొడ్డు దమయంతి రెండు కిడ్నీలు పాడైపోయి పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో డయాలసిస్ సేవలు పొందుతుంది. ఇటీవల బీపీ పెరిగిపోయి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం నిమిత్తం రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. దీంతో ఈ నెలకు సంబంధించిన పింఛన్ మొత్తం పది వేల రూపాయలను గ్రామవలంటీర్ బొడ్డు స్వప్న వంద కిలోమీటర్లు ప్రయాణించి.. ఆస్పత్రికి వెళ్లి దమయంతికి అందజేశారు.

ఆరోగ్యశ్రీ ఆదుకుంది



హైమావతిని పరామర్శిస్తున్న నాయకులు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ మూడో వార్డు జయరామచంద్రపురం గ్రామానికి చెందిన పిన్నింటి హైమావతి గుండె సంబంధిత వ్యాధితో బాధపడేవారు. దీంతో ఆమెకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శ్రీకాకుళంలోని మెడికవర్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయడంతో కోలుకొని ఇంటికి చేరారు. ఈ సందర్భంగా ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ పథకమే తన ప్రాణాన్ని కాపాడిందని సంతోషం వ్యక్తం చేశారు. ఆపరేషన్ కోసం ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు ఖర్చు చేసినట్టు చెప్పారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రత్యేక శ్రద్ధతో సకాలంలో ఆపరేషన్ అయిందని చెప్పి ఆయనకు, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా హైమావతిని మున్సిపల్ వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, కౌన్సిలర్లు సవర సోమేశ్వరరావు, సనపల సింహాచలం, బదకల తుంబేసు, బల్ల శ్రీనివాస్, కిక్కర ఆదినారాయణ, కిక్కర పాపారావు, పిన్నింటి నాగేశ్వరరెడ్డి, బిరగడ్ల ప్రసాద్, బద్రి నాగార్జున, మార్పు వెంకటరమణ, డిక్కల ధనుంజయ, బద్రి రమణ, రంది రాజారావు పరామర్శించారు.

వలంటీర్లు నిస్వార్థ సేవకులు

ఇచ్ఛాపురం రూరల్: ప్రభుత్వానికి.. ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తున్న గ్రామ వలంటీర్లు నిస్వార్థక సేవకులని జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిరియ విజయ అన్నారు. ఈశ్వరం గ్రామ సచివాలయంలో సోమవారం నిర్వహించిన 'వలటీర్లకు వందనం' కార్యక్రమంలో అమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళ్తున్న గ్రామ వలంటీర్ల పనితీరుకు ఇతర రాష్ట్రాల సైతం సలాం చేస్తున్నాయని అన్నారు. ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు, వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి, కౌన్సిలర్ బచ్చ జగన్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సల్ల దేవరాజు, మాజీ ఎంపీపీ కారంగి మోహన్‌రావు ఉన్నారు.

డిప్యూటీ ఈవోగా రామకృష్ణ



రామకృష్ణను అభినందిస్తున్న సిబ్బంది

టెక్కలి రూరల్: టెక్కలి డిప్యూటీ ఈవోగా నక్క రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గార ఎంఈవోగా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. కాగా ఇప్పటివరకూ ఇన్‌చార్జిగా వ్యవహరించిన ఆర్.విజయకుమారి శ్రీకాకుళం డిప్యూటీ విద్యాశాఖాధికారిగా వెళ్లిపోయారు. బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణను మండల విద్యాశాఖాధికారులు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు, పలువురు ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది అభినందించారు.